


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
01-03-2025
పేజీలు: 02



# తగ్గిన బంగారం

బంగారం కొనాలనుకునే వారికి గుడ్ న్యూస్. దేశంలో మరోసారి బంగారం ధరలు తగ్గాయి. తాజా రేటు ప్రకారం 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర 84,450గా ఉంది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.79,590గా ఉంది. గత కొద్ది రోజులుగా బంగారం ధర తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా జువెలర్స్ నుంచి డిమాండ్ తగ్గడం, మదుపర్ల లాభాల స్వీకరణ వంటి కారణాలతో దేశవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇక కిలో వెండి ప్రస్తుతం 94,230గా ఉంది. బంగారం స్వచ్ఛతను క్యారట్లలో కొలుస్తారన్న విషయం తెలిసిందే. 24 క్యారట్ల బంగారం అంటే 99.9 స్వచ్ఛమైనదని అర్థం. ఇక నగల తయారీకి వాడే 22 క్యారట్ల బంగారం స్వచ్ఛత 91.6 శాతం. జీఎస్టీ అమలుకు పూర్వం వివిధ రాష్ట్రాల్లో బంగారం మధ్య తేడాల్లో ఎక్కువగా ఉండేవి. ఆ తరువాత పన్ను విధానం సరళీకృతం కావడంతో వివిధ ప్రాంతాల మధ్య బంగారం ధరల్లో తేడాలు తగ్గాయి. అయితే, స్థానిక పరిస్థితులు, డిమాండ్ - సప్లై అంతరాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తుంటాయి.

హైదరాబాద్: రూ. 87,440,
అహ్మదాబాద్: రూ. 84,410
ముంబై: రూ. 84,300
కోల్‌కతా: రూ, 84,190



# టీమిండియాకు గుడ్ న్యూస్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో టీమిండియా తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఆదివారం(మార్చి 2) దుబాయ్ వేదికగా న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. ఇప్పటికే సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న టీమిండియా.. ఈ మ్యాచ్‌లో కూడా గెలిచి టేబుల్ టాపర్‌గా లీగ్ స్టేజిని ముగించాలని భావిస్తోంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు భారత్‌కు గుడ్ న్యూస్ అందింది. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఈ గాయం కారణంగా రెండు రోజుల పాటు ప్రాక్టీస్ సెషన్‌కు దూరంగా ఉన్న రోహిత్.. తిరిగి మళ్లీ నెట్స్‌లో అడుగుపెట్టాడు. శుక్రవారం దాదాపు 95 నిమిషాల పాటు రోహిత్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఈ విషయాన్ని భారత క్రికెట్ జట్టు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డెష్కాట్ ధ్రువీకరించాడు. "రోహిత్ శర్మ గాయంపై ఎటువంటి ఆందోళన అవసరం లేదు. అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. నెట్స్‌లో చాలా సమయం పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఫీల్డింగ్ ప్రాక్టీస్‌లో కూడా అతడు భాగమయ్యాడు. అతడికి ఈ గాయాన్ని ఎలా మెనేజ్ చేయాలో బాగా తెలుసు" అని ప్రీ మ్యాచ్ కాన్ఫరెన్స్‌లో టెన్ డెష్కాట్ పేర్కొన్నాడు.



# ట్రంప్, జెలెన్ స్కీ మధ్య మాటల యుద్ధం

వరల్డ్ వార్ -3 ట్రెండింగ్ లోకి వచ్చింది. మీడియా ముందు ట్రంప్, జెలెన్ స్కీ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ తరునంలోనే_ _ _ వరల్డ్ వార్ -3 ట్రెండింగ్ లోకి వచ్చింది. శాంతి ఒప్పందానికి జెలెన్ స్కీ అంగీకరించకపోవడం వల్ల మూడో ప్రపంచ యుద్ధం తప్పేలా లేదన్నారు ట్రంప్.ట్రంప్ తో గొడవ పడ్డ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి మద్దతుగా నిలిచాయి ఫ్రాన్స్, యూరోపియన్ యూనియన్ దేశాలు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మీడియా ముందే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఈ తరుణంలోనే.. వరల్డ్ వార్ -3 ట్రెండింగ్ లోకి వచ్చింది. ట్రంప్, జెలెన్ స్కీ మధ్య మాటల సారాంశం ఇప్పుడు వైరల్ గా మారింది.

ఉక్రెయిన్‌పై ట్రంప్ సంచలనం నిర్ణయం?

మూడు సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతూ వస్తోన్న రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించడానికి అమెరికా చేసిన తొలి ప్రయత్నం విఫలమైనట్టే. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- ఉక్రెయిన్‌కు చెందిన కౌంటర్‌పార్ట్ వొలొదిమిర్ జెలెన్‌స్కీతో నిర్వహించిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి జెలెన్‌స్కీ అంగీకరించట్లేదనేది వైట్‌హౌస్ వాదన. అది నిజమని నిరూపించేలా వ్యవహరించారు జెలెన్‌స్కీ. డొనాల్డ్ ట్రంప్‌తో ముఖాముఖి భేటీ అనంతరం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. డొనాల్డ్ ట్రంప్‌కు క్షమాపణ చెప్పడానికి నిరాకరించారు. అమెరికా పర్యటనలో ఉన్న జెలెన్‌స్కీ- వైట్‌హౌస్ ఓవల్ ఆఫీస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. యుద్ధాన్ని నివారించడమే ఈ అత్యున్నత స్థాయి సమావేశం ప్రధాన అజెండా. ఈ విషయంలో ట్రంప్ చేసిన కొన్ని ప్రతిపాదనలను అంగీకరించలేదు జెలెన్‌స్కీ. కాల్పుల విరమణకు ఒప్పుకోలేదు. ఫలితంగా- ఈ ఇద్దరు నేతల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సుదీర్ఘ వాదులట సంభవించింది. ఈ హీటెడ్ డిబేట్ మొత్తం కూడా లైవ్ టెలికాస్ట్ అయింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తరఫున ట్రంప్ వాదిస్తోన్నారనే అభిప్రాయాన్ని పరోక్షంగా వ్యక్తం చేశారు జెలెన్‌స్కీ. మధ్యవర్తిగా రెండు దేశాలకు ప్రయోజనం కలిగించడానికి భిన్నంగా పుతిన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోన్నారనే వాదనను వినిపించారు. ఈ వాగ్వివాదం కారణంగా ఈ భేటీ అర్ధాంతరంగా ముగిసింది. చర్చలు కొనసాగుతున్న దశలోనే జెలెన్‌స్కీ.. వైట్ హౌస్ నుంచి బయటికి వెళ్లిపోయారు. చర్చల మధ్యలో నుంచే వెళ్లిపోయినందుకు క్షమాపణ చెప్పాలనే డిమాండ్ సైతం తెరమీదికి వచ్చింది. దీన్ని ఆయన తోసిపుచ్చారు. తానేమీ తప్పుగా ప్రవర్తించలేదంటూ సమర్థించుకున్నారు. దీని తరువాత జెలెన్‌స్కీ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆ దేశం నుంచి ఫ్రాన్స్‌కు వెళ్లి బయలుదేరి వెళ్లిపోయారు. ఇమ్మాన్యుయెల్ మక్రాన్‌తో భేటీ అయ్యే అవకాశం ఉంది. మరోవంక- మెజారిటీ యూరప్ దేశాలు ఆయనకు మద్దతు ప్రకటించాయి. జెలెన్‌స్కీ ఒంటరివాడు కాదని, ఆయనకు అండగా ఉంటామని ఆయా దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు చెబుతున్నారు.ఈ పరిణామాల మధ్య డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఇప్పటివరకు ఉక్రెయిన్‌కు అందించిన అన్ని రకాల సహాయ, సహకారాలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. ఆర్థికం, రక్షణ, ఆయుధ సామాగ్రి తరలింపును రద్దు చేయడం మొదలుకుని ద్వైపాక్షిక సంబంధాలపైనా పునఃసమీక్షించుకుంటారని సమాచారం. దీనిపై ది వాషింగ్టన్ పోస్ట్ ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. రష్యాతో యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఉక్రెయిన్‌కు ఆర్థిక ప్యాకేజీలను ప్రకటిస్తూ వచ్చింది అమెరికా. అత్యాధునిక యుద్ధ సామాగ్రినీ తరలించింది. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో దీనికి సంబంధించిన పలు ఒప్పందాలు ఈ రెండు దేశాల మధ్య కుదిరాయి కూడా.




# పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర

దేశ వ్యాప్తంగా వాణిజ్య సిలిండర్ల ధరలు పెరిగాయి. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కమర్షియల్ సిలిండర్ ధరలను పెంచాయి. 19 కేజీల కమర్షియల సిలిండర్ ధరను రూ.6 పెంచాయి. పెరిగిన ధరలతో ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1797 నుంచి 1803కి చేరింది. అయితే ఆగస్టు 2024 నుంచి 14.2 కిలోల గృహ ఎల్పీజీ సిలిండర్ల ధరలో మాత్రం ఎలాంటి మార్పు జరగలేదు. పెరిగిన ధరలు శనివారం నుంచే అమల్లోకి రానున్నాయి. గత ఫిబ్రవరి నెలలో చమురు మార్కెట్ కంపెనీలు 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ రేటును రూ.7 తగ్గించాయి.



# ఏపీలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

ఏపీలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల పరీక్షలు జరుగనున్నాయి. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాషపై పరీక్ష నిర్వహిస్తున్నారు. ఏపీ వ్యాప్తంగా 1500 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 10.58 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. పరీక్షా కేంద్రాలకు నో మొబైల్ జోన్‌గా ప్రకటించారు. అయితే అధికారిక సమాచారం కోసం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఇంటర్ బోర్డు ఒక కీపాడ్ ఫోన్ సమకూర్చింది. ఈ పరీక్షలకు నిమిషం నింబంధనను అమలు చేస్తున్నారు. పరీక్షలు హాజరయ్యే వారు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని అధికారులు తెలిపారు. విద్యార్థులందరూ నింబంధనలను తప్పకుండా పాటించాలని చెప్పారు.



# ఢిల్లీ ధమాకా

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో నిరుటి రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో ఢిల్లీ దుమ్మురేపింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత జెస్ జొనాసెన్(3/25), మిన్ను మణి(3/17) ధాటికి ముంబై 20 ఓవర్లలో 123/9 స్కోరుకు పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(22), హేలీ మాథ్యూస్(22) మినహా అందరూ స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన ఢిల్లీ 14.3 ఓవర్లలో విజయాన్నందుకుంది. కెప్టెన్ మెగ్ ల్యానింగ్(49 బంతుల్లో 60 నాటౌట్, 9ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో అదరగొట్టింది. షెఫాలీవర్మ(43) ఆకట్టుకుంది. అమన్‌జోత్‌కు ఏకైక వికెట్ దక్కింది. జొనాసెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.


# రోజురోజుకి పెరుగుతున్న దోమల బెడద



హైదరాబాద్ సిటీ దోమలతో అట్టుడికిపోతుంది, ఎక్కడ చుసిన భయంకరమైన దోమలు ప్రజలని చుట్టుముడుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా గ్రేటర్ పరిధిలో దోమలు పెరగడానికి చాల కారణాలే ఉన్నాయి. ఇటీవల కాలంలో జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం పతాక స్థాయికి చేరుకుంది. ఒకప్పుడు దోమల సీజన్ మొదలవ్వగానే,సిటీ అంతటా వారానికి రెండు మూడు సార్లు అయిన ఫాగింగ్ జరిగేది. కానీ ఇప్పుడు పెరుగుతున్న దోమల తాకిడికి తగ్గట్టు జీహెచ్ఎంసీ సిబ్బంది ఎలాంటి ఏర్పాట్లు చెయ్యకపోవడం అందర్నీ ఆగ్రహానికి గురి చేస్తుంది. సాయంత్రం ఆరు దాటాక బయటకి వస్తే దోమల దెబ్బకి పలహారం అయిపోవడం ఖాయం అని సోషల్ మీడియాలో ప్రజలు ఒకరికి ఒకరు హెచ్చరికలు జారీ చేసుకుంటున్నారు.దోమల బెడదకు నిద్రలు లేక సిటీ వాసులు అవస్థలు పడుతున్నారు.వర్షాకాలం నుండి దోమలు రావడం సహజం కానీ, చలికాలం వెళ్ళిపోయాక కూడా దోమలు విజృంభించడం అనేది పూర్తిగా జీహెచ్ఎంసీ వైఫల్యం అనే చెప్పాలి. ప్రజలని పట్టించుకోవాల్సిన జీహెచ్ఎంసీ మాత్రం మొద్దు నిద్రపోతుంది. ఒకప్పుడు జీహెచ్ఎంసీ సిబ్బంది రోజు డ్రైనేజీ శుభ్రం చెయ్యడం, మరుగు నీటిని మళ్లించడం లాంటి పనులు చేసేవారు, కానీ గత ఏడాదిగా ఇవన్నీ ఆగిపోయాయి. చాల చోట్ల డ్రైనేజీ మురుగు నీరు రోడ్ మీదనే పారుతున్నాయి. రోడ్ మీద వాహనాలు నడిపేవారికి కంపు వాసన వస్తున్న, పట్టించుకునే నాధుడే లేదు. ఎక్కడ పడితే అక్కడ డ్రైనేజీ లీక్ అవ్వడంతో దోమల స్వైర విహారం బాగా పెరిగిపాయింది. సిటీ లో కొన్ని చోట్ల చెరువులు కుంటలు మొత్తం డ్రైనేజీ మరుగు నీటితో నిండిపోవడంతో, అవన్నీ దోమలకి అడ్డా లాగ మారిపోతున్నాయ్. కొన్ని చోట్ల పెద్ద ఎత్తున భవన నిర్మాణలు జరగడం కూడా దోమలు పెరగడానికి కారణం అని చెప్పొచ్చు. చెరువులు, కుంటలకు దగ్గరగా ఉన్న ఇళ్లల్లో దోమల దండయాత్రకు విషజ్వరాలు పెరిగిపోతున్నాయి. వారానికి ఒక్కసారి అయిన జ్వరాల బారిన పడే భయంకరమైన పరిస్థితి ఏర్పడుతుంది.

చాల చోట్ల దోమల దెబ్బకి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి విషజ్వరాలతో సిటీ వాసులు మంచం పడుతున్నారు. దోమల దండయాత్ర నుండి తప్పించుకోడానికి జెట్ కాయిల్స్,అగర్బత్తి , ఆల్ అవుట్ లాంటివి వాడుతున్నప్పటికీ పెద్ద ఉపయోగం లేదని ప్రజలు వాపోతున్నారు. మణికొండ నెక్నాంపూర్ చెరువు ,మీర్ ఆలం ట్యాంక్, నల్లగండ్ల చెరువు, లంగర్ హౌస్, కొండాపూర్, గచ్చిబౌలి, కూకట్ పల్లి, చాదర్ ఘాట్, దిల్‌సుఖ్‌నగర్ ఇలా చెప్పుకుంటూ పోతే గ్రేటర్ అంతటా దోమల దండయాత్ర భయంకరంగా ఉంది. మూసీ ప్రాంతం, మణికొండలో అయితే దోమల తాకిడి భయానకంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా జి.హెచ్.ఎం.సి మాత్రం కనీస దోమల నివారణ చర్యలు తీసుకోవట్లేదు. గ్రేటర్ పరిధిలో ఉన్న సగం జోన్లలో సీనియర్ ఎంటమాలజిస్ట్, చీఫ్ ఎంటమాలజిస్ట్ పోస్టులు ఖాళీ ఉండటం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శం అని చెప్పాలి. ఇంతకు ముందు కోల్డ్ ఫాగింగ్ అని సిటీ లో అన్ని చోట్ల దోమల నివారణ కార్యక్రమం జరిగేది, కానీ ఏడాది కాలంగా అవన్నీ జీహెచ్ఎంసీ ఆపేసింది. ఇంకో వైపు జీహెచ్ఎంసీ వార్మ్ ఫాగింగ్ అనే కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తున్నామని హడావిడి చేసినప్పటికీ, అది ప్రకటనలకే పరిమితం అయింది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ మొద్దు నిద్ర వదిలి సిటీలో అన్ని ప్రాంతాలలో ఫాగింగ్ చేసి దోమల బెడద తగ్గించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బ్లాక్ స్లాబ్ కూలిపోవడంతో ముగ్గురికి గాయాలు



గురువారం రాత్రి హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో నిర్మాణంలో ఉన్న కొత్త అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ స్లాబ్ కూలిపోవడంతో కనీసం ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.భవనం పొడిగింపు యొక్క స్తంభం మరియు పైకప్పు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన మెటల్ ఫ్రేములు అకస్మాత్తుగా కూలిపోవడంతో ఈ సంఘటన జరిగింది, నిర్మాణ కార్మికులు గాయపడ్డారు. విశ్వవిద్యాలయ అధికారులు అప్రమత్తం కావడంతో, గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని చెబుతున్నారు. గచ్చిబౌలి పోలీసులు మరియు విశ్వవిద్యాలయ అధికారులు ఈ సంఘటనపై సంయుక్త దర్యాప్తు ప్రారంభించారు. నిర్మాణ పనులు చేపట్టే సమయంలో భద్రతా విధానాలు అమలులో ఉన్నాయా లేదా ఎవరైనా వ్యక్తి పొరపాటు వల్ల కూలిపోయారా అని వారు దర్యాప్తు చేస్తున్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నుంచి 3 మృతదేహాల వెలికితీత

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) సొరంగం ప్రమాదంలో సహాయక చర్యలు చివరి దశకు చేరుకున్నాయి. ప్రమాద స్థలంలో భారీగా పేరుకుపోయిన బురద నుంచి మూడు మృతదేహాలను సహాయక బృందాలు వెలికి తీశాయి. మధ్యాహ్నంలోపు మొత్తం 8 మృతదేహాలను వెలికి తీయాలని ప్రయత్నిస్తున్నారు. మరోవైపు.. నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ఎనిమిది అంబులెన్స్‌లు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి మృతదేహాలను నేరుగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించనున్నట్లు సమాచారం. అక్కడి గుర్తింపు పరీక్షలు, ఇతర ఫార్మాలిటీస్ పూర్తయ్యాకే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. మరోవైపు టన్నెల్ వద్దకు ఉస్మానియా ఫోరెన్సిక్ బృందం చేరుకుంది. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీధర్ చారితో పాటు ఇద్దరు సిబ్బంది, మరో ఇద్దరు పీజీ వైద్యులు, నాగర్ కర్నూల్ డీఎంహెచ్‌వో కూడా టన్నెల్ వద్దకు చేరుకున్నారు. మృతదేహాల వెలికితీత క్రమంలో.. కార్మికుల కుటుంబాల రోదనలతో టన్నెల్ వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇవాళ ఎలాగైనా





మృతదేహాలను వెలికి తీసి.. బంధువులకు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి 22వ తేదీన ఉదయం 8.30గం. ప్రాంతంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగింది. అప్పటి నుంచి ఆచూకీ లేకుండా పోయిన ఎనిమిది మంది ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ప్రమాదం జరిగిన స్థలంలో మృతదేహాల అవశేషాలను గుర్తించిన సంగతి తెలిసిందే. ప్రమాదం జరిగిన స్థలంలో లో 200 మీటర్ల పొడవు, 9.2 మీటర్ల ఎత్తులో బురద, మట్టి, రాళ్లు పేరుకుపోయాయి. జీపీఆర్, అక్వాఐతో బురదలో ఊరుకుపోయిన మృతదేహాల అవశేషాలు బయటపడ్డాయి. దీంతో జేపీ కంపెనీ ఏర్పాటు చేసిన లోకో ట్రైన్‌ను 13.5 కిలోమీటర్ వరకు తీసుకొచ్చి.. మృతదేహాలను బయటకు తెస్తున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ఎనిమిదో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. NDRF, SDRF, ఆర్మీ, నేవీ, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, రైల్వే రెస్క్యూ టీంలు పాల్గొంటున్న సంగతి తెలిసిందే.



## 'చవా' 14 రోజుల వరల్డ్ వైడ్ కలెక్షన్స్ ఎంతంటే...!

లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన 'చావా' ఛత్రపతి సంభాజీ మహారాజ్ శౌర్యాన్ని ప్రదర్శిస్తూ బాలీవుడ్ లో సెన్సేషన్ ని సృష్టిస్తుంది. ఈ చిత్రం మంచి ఆదరణ పొందింది, ప్రేక్షకులు దర్శకుడి యొక్క గౌరవప్రదమైన మరియు చిత్రణను ప్రశంసించారు. విక్కీ కౌషల్ మరియు రష్మికా మాండన్న నటించిన చవా ఈ సంవత్సరం బాలీవుడ్ యొక్క మొట్టమొదటి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ చిత్రం రేవ్ సమీక్షలను సంపాదించింది మరియు బాక్సఆఫీస్ వద్ద ఘూనా నంబర్లను సాధించింది. తాజాగా ఇప్పుడు ఈ చిత్రం వరల్డ్ వైడ్ బాక్సఆఫీస్ వద్ద విడుదలైన 14 రోజులలో 555.3 కోట్ల గ్రాస్ ని రాబట్టింది. ఈ విషయాన్ని ప్రొడక్షన్ హౌస్ సోషల్ మీడియాలో స్పెషల్ పోస్టర్ ని విడుదల చేసి ప్రకటించింది. బ్లాక్ బస్టర్ హిట్‌గా దాని హోదాను మరింత సుస్థిరం చేసింది. పరిశ్రమ విశ్లేషకులు ఈ చిత్రం యొక్క జోరు కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. ఎ.ఆర్. రెహ్మాన్ ఈ చారిత్రాత్మక ఇతిహాసం కోసం సంగీతాన్ని కంపోజ్ చేశాడు. ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నా, అశుతోష్ రానా, దివ్య దత్తా మరియు నీల్ భూపాలం ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని మాడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తుంది.

## నేడు నెల్లూరులో పర్యటించనున్న సీఎం చంద్రబాబు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుబు శనివారం చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జీడీ నెల్లూరులో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. అలాగే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్‌ను పంపిణీ చేయనున్నారు. 10 సూత్రాల అంశంపై ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చంద్రబాబు పరిశీలించనున్నారు.అలాగే రామానాయుడుపల్లిలో ప్రజాప్రతినిధుల సమావేశంలో చంద్రబాబు పాల్గొననున్నారు. గ్రామస్థులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా.. సీఎం కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అటు అధికార యంత్రాంగం, ఇటు కూటమి నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## సెమీస్‌కు మాథ్యూ షార్ట్ డౌటే




ఆస్ట్రేలియా ఓపెనింగ్ బ్యాటర్ మాథ్యూ షార్ట్ గాయపడ్డాడు. దీంతో అతను చాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో ఆడేది అనుమానంగా ఉన్నది. ఆఫ్ఘనిస్తాన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అతను గాయపడ్డాడు. 15 బంతుల్లో 20 రన్స్ కొట్టిన అతను.. కొంత ఇబ్బందిపడినట్లు తెలుస్తోంది. అయితే గ్రూపు బీ నుంచి నాలుగు పాయింట్లతో ఆస్ట్రేలియా సెమీస్‌కు వెళ్లింది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో.. షార్ట్ 63 రన్స్ చేశాడు. ఫామ్‌లో ఉన్న షార్ట్ గాయపడడంతో ఆస్ట్రేలియాకు సెమీస్‌లో కష్టాలు ఎదురయ్యే ఛాన్సు ఉంది. సెమీస్‌లో షార్ట్ ఆడేది అనుమానమే అని కెప్టెన్ స్మిత్ పేర్కొన్నాడు. అతను ఇబ్బందిపడుతున్నాడని, సరిగా కదలేకపోతున్నాడని, అతను త్వరగా రికవరీ కావడం కష్టమే అన్నాడు. అయితే షార్ట్ స్థానంలో మరో భారీ హిట్టర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌కు అవకాశం ఇచ్చే ఆలోచనలో ఆస్ట్రేలియా ఉన్నట్లు తెలుస్తోంది.





## కన్నప్ప టీజర్ రిలీజ్

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' టీజర్ వచ్చేసింది. 2025 ఏడాది మొదలైన నుంచి ఈ చిత్రం నుంచి వరుస అప్డేట్స్ వస్తూనే ఉన్నాయి. అందులో భాగంగా నేడు (మార్చి 1న) కన్నప్ప సెకండ్ టీజర్ గ్రాండ్ గా రిలీజయింది. కన్నప్ప ఫస్ట్ టీజర్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ చేశారు. బాలీవుడ్ డైరెక్టర్ ముకేష్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్న కన్నప్ప లేటెస్ట్ టీజర్ ఆసక్తికరంగా సాగింది. విష్ణు నటన, టీజర్ విజువల్స్ సినిమాపై అంచనాలు పెంచాయి. తిన్నడు పాత్రలో మంచు విష్ణు కనిపించాడు. తన వారి కోసం ఎంతటి వారినైనా ఎదిరించే వాడిగా విష్ణు ఆకట్టుకున్నాడు. 'ఆపద వచ్చిన ప్రతిసారి వీరుల తలలు కోరుకునే ఈ రాయి దేవత కాదు' అనే విష్ణు డైలాగ్ పవర్ ఫుల్ గా ఉంది. అంతటి నాస్తికుడు మీకు భక్తుడవుతాడా? అని శివుడి భార్యగా పార్వతి పాత్రలో నటించిన కాజల్ చెప్పే డైలాగ్ సైతం ఆసక్తిగా ఉంది. ఈ టీజర్ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే భక్తి, త్యాగం మరియు గొప్పతనం యొక్క చారిత్రక కథనాన్ని చెప్పే దిశగా సాగింది. టీజర్ చివర్లో ప్రభాస్ 'డివైన్ గార్డియన్' రుద్రుడిగా కనిపించిన విజువల్స్ కన్నుల పండుగలా అనిపిస్తోంది. అక్షయ్ కుమార్ శివుడి పాత్రలో మంచి ఆహార్యాన్ని, గాంభీర్యాన్ని కనబరిచాడు. ఇకపోతే, ఈ మూవీ ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. దాంతో మేకర్స్ వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు. ఈ మూవీకి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవస్సే మ్యూజిక్, బీజీఎం అందిస్తున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల పై మంచు మోహన్ బాబు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. మరి మంచు ఫ్యామిలీలోనే ప్రెస్టీజియస్ ప్రాజెక్టు గా వస్తున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో మంచుచరియలు విరిగిపడ్డ ఘటనలో.. మరో 14 మంది కార్మికుల్ని రక్షించారు. ఇంకా 8 మంది కార్మికులు మంచుచరియల కింద ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 55 మంది కార్మికుల్లో 47 మందిని రక్షించారు. బద్రీనాథ్, మానా మధ్య ఉన్న బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ క్యాంపుపై మంచుచరియలు విరిగిపడ్డ విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి వరకే 33 మందిని కాపాడారు. వర్షం, మంచు తుఫాన్ వల్ల.. రెస్క్యూ ఆపరేషన్ ఇబ్బందికరంగా మారింది. శుక్రవారం రాత్రి ఆపరేషన్ నిలిపివేశారు. ఇవాళ ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. ఐటీబీపీ పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టినట్లు జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆఫీసర్ ఎన్‌కే జోషీ తెలిపారు. మంచుచరి wయలు విరిగిపడ్డ ప్రదేశాన్ని ఇవాళ సీఎం పుష్కర్ సింగ్ ధామీ పర్యటించే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం ఉత్తరాఖండ్‌లో మంచు చరియలు బీభత్సం సృష్టించాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న హిమపాతం సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నది.



ఈ క్రమంలో చమేలి జిల్లాలోని మన అనే సరిహద్దు గ్రామంలో చమోలి-బద్రీనాథ్ రహదారిపై ఏర్పాటు చేసిన శిబిరంపై పెద్దయెత్తున మంచు చరియలు విరుచుకు పడటంతో అక్కడ పనిచేస్తున్న 57 మంది బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) కార్మికులు చిక్కుకుపోయారు. శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఇది చోటుచేసుకోగా, ఆ సమయానికి కార్మికులు ఎనిమిది కంటైనర్లు, ఒక షెడ్‌లో ఉన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై వారిని బయటకు తీసేందుకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

## తీన్మార్ మల్లన్నకు షాక్.. కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్

ఎమ్మెల్సీ చింతపండు నీవన్ (తీన్మార్ మల్లన్న)కు బిగ్ షాక్ తగిలింది. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఇటీవల బీసీ సభలో ఓ వర్గంపై మల్లన్న వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలాకు పాల్పడుతున్నట్లు హైకమాండ్ గుర్తించింది. ఆ వ్యాఖ్యలపై ఫిబ్రవరి 12 లోపు వివరణ ఇవ్వాలని ఫిబ్రవరి 5న షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో మల్లన్న స్పందించకపోవడంతో పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. కాగా.. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు ఉంటాయని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తెలిపారు. మీనాక్షి నటరాజన్ పని మొదలుపెట్టారని అన్నారు. నిన్న గాంధీభవన్‌కు వచ్చిన ఆమె.. పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారని తెలిపారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. పార్టీ లైన్ తప్పి వ్యవహరించిన వారిపై చర్యలకు ఆదేశిస్తామని చెప్పారు. ఓ వర్గాన్ని అవమానించినందుకు సస్పెండ్ చేయలేదని.. పార్టీ చేసిన సర్వే, సర్వే కాపీలను చింపినందుకు సస్పెండ్ చేసినట్లు మహేశ్ గౌడ్ తెలిపారు.

